ప్రజలపై అదనపు విద్యుత్ చార్జీల భారాలు తగ్గించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ

విశాలాంధ్ర - నర్సీపట్నం: ప్రజలపై అదనపు విద్యుత్ చార్జీల భారాలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. నర్సీపట్నం కృష్ణా ప్యాలస్‌లో సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు అఖిలపక్ష ప్రజా పార్టీలు, ప్రజాసంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురు బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బాలేపల్లి మాట్లాడుతూ సీఎం జగన్ గ్యాస్, పెట్రోలు, నిత్యావసర ధరలు, బస్సు చార్జీలు ఇష్టారాజ్యంగా పెంచుకుంటూ మరోపక్క ప్రజలపై ఆరు స్లాబులు కుదించి అదనపు కరెంటు చార్జీల భారాలు మోపుతూ స్మార్ట్ మీటర్లో పెట్టే ప్రతిపాదన విరమించుకోవాలని అన్నారు. లేని పక్షంలో ప్రజలు ఎన్ని పథకాలు పెట్టినా రానున్న ఎన్నికల్లో గద్దె దింపుతారని అన్నారు. ప్రజా పార్టీలు, ప్రజాసంఘాలు ఏకగ్రీవంగా తీర్మానించి ఈనెల జూన్ 30వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర నిరసన ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ పీసీసీ సభ్యులు మీసాల సుబ్బన్న, అఖిలపక్ష పార్టీల, ప్రజా సంఘ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, కె.వి.సత్య ప్రభ, ఎ.ల్.వి.రమణ, భవాని, తిరుమలరెడ్డి, నంగిన రమణ, జి.రాజు, మాణిక్యం, ఎ.సిద్ద, జి.రాధాకృష్ణ, భాస్కరరావు, దొర, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోతిన సన్యాసిరావుకు ఘన నివాళి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పోతిన సన్యాసి రావు 101వ జయంతి వేడుకలు ఉక్కు నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. సన్యాసిరావు చిత్ర పటానికి ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ మాట్లాడుతూ పోతన సన్యాసిరావు కమ్యూనిస్ట్ పార్టీ నేతగా, ఉక్కు నిర్వాసిత ఉద్యమంలో పాల్గొన్నారని అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఆయన చేసిన పోరాటం మరువ లేమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులకు స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షులు కె.ఎస్.ఎన్.రావు, అసిస్టెంట్ ట్రెజరర్ కె.రాజ బాబు, టి.ఎస్.ఎన్.జయ, ప్రసాద్, త్రినాథ్, మంత్రి రవి, ఈశ్వరరావు, జి జి ఆనంద్ పాల్గొన్నారు.

జీవో నెంబర్ 21ని రద్దు చేయాలి

విశాలాంధ్ర - విశాఖ : కేంద్ర ప్రభుత్వం ప్రమాద నివారణ పేరుతో తీసుకొచ్చిన జీవో నెంబర్ 27 ఆటో మ్యాక్సీ మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ఉరి తగిలించే విధంగా ఉందని ఆటో యూనియన్ అధ్యక్షులు షేక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి సీహెచ్.కాసుబాబు విమర్శించారు. విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మద్రిపాలెం సర్వీస్ రోడ్ నుండి ఆర్టీఏ కార్యాలయం వరకు ప్రదర్శన, అనంతరం ధర్నా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే బేరాలు లేక అతి కష్టంపై జీవన సాగిస్తున్న ఆటో కార్మికులపై జీవో నెంబర్ 21 కింద వేలాది రూపాయలు జరిమానాలు విధిస్తున్నారని దుయ్యబట్టారు. దీనివల్ల ఆటో డ్రైవర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. జీవో నెంబరు 21 వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలను వెంటనే జీఎస్టీ పరిధిలోకి తేవాలని అన్నారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీటీసీ జి.రాజారత్నంకి అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.సింహాద్రి, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.మన్మథరావు, ఎస్.నాగభూషణ్, సాయి కుమారు, మధు, అప్పలరాజు, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

ఎకో టూరిజం హబ్‌గా అంజోడ సిల్క్ ఫారం

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: అంజోడ సిల్క్ ఫారంను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని అటవీ శాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధు సూదనరెడ్డి చెప్పారు. మండలంలోని పర్యటక కేంద్రమైన అంజోడ సిల్క్ ఫారంను ఆయన మంగళవారం సందర్శించారు. మొక్కలను నాటి ఎకో టూరిజం ఫైన్ ప్రాజెక్టును ప్రారంభించారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా కాటేజీలు, కాఫీ విడిది హౌస్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టెంట్లు, మరుగుదొడ్లు, కాటేజీల నిర్మాణ ప్రదేశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకాంతనాథరెడ్డి, డీఎఫ్ వినోద్ కుమార్, అటవీశాఖ రేంజర్ శ్రీనివాసరావు, సెక్షన్ అధికారి క్రిష్ణంనాయుడు, బీట్ అధికారులు ఉద్దంగి, చంటి, విఎస్ఎస్ చైర్మన్ భారతి, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

భూ రీ సర్వే వేగవంతం చేయండి

విశాలాంధ్ర - అనంతగిరి: ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న భూ రీ సర్వే సాగు రైతులకు అపోహలు లేకుండా వేగవంతం చేయాలని స్థానిక జెడ్పీటీసీ దీసరి గంగరాజు అన్నారు. మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామంలో రెండు బృందాలుగా ఏర్పడి నిర్వహిస్తున్న భూ రీ సర్వే పనితీరును ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, సర్వేయర్లు భాస్కర్, బాలకృష్ణ, సిబ్బంది, రైతులు చిన్న గంగులు, భీమన్న, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అటవీ శాఖదే

విశాలాంధ్ర - అనంతగిరి: అడవుల్ని కాపాడి ప్రకృతికి న్యాయం చేయవలసిన బాధ్యత అటవీ శాఖ సిబ్బందిపై ఉందని రాష్ట్ర పీసీసీఎఫ్ వై.మధుసూదన రెడ్డి సూచించారు. మంగళవారం అనంతగిరి మండలం చిలకలగెడ్డ ఫారెస్ట్ ఠాణా వద్ద ఏకో టూరిజం ప్రాజెక్ట్‌ను ప్రారంభిం చారు. అరకులోయకు వచ్చే పర్యాటకులకు ఏజెన్సీ ముఖద్వారం కావడంతో వెళ్లి వచ్చే వారు సేద తీర్చుకునేందుకు రెస్టారెంట్, పిల్లలకు ఆటస్థలం, వ్యాయాయం చేసేందుకు 3 కిలోమీటర్ల ట్రక్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ శ్రీకాంత్ నాథ్ రెడ్డి, పాడేరు డీఎఫ్ఓ వినోద్ కుమార్, అనంతగిరి రేంజర్ దుర్గాప్రసాద్, ఫారెస్టర్‌లు సీతారాం, శ్రీహరి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర - తగరపువలస: సిపిఎం పార్టీ భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో కరెంటు చార్జీలపై చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ భీమిలి జోన్ కమిటీ నాయకులు రవ్వ నర్సింగ్‌రావు, అప్పలనాయుడు మాట్లాడుతూ సామాన్య ప్రజలపై వైయస్సార్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడుసార్లు కరెంట్ చార్జీలు పెంచారని అదనపు భారాలు వేయడం తగదన్నారు. మళ్లీ సర్దుబాటు చార్జీలు పేరట 6000 కోట్ల రూపాయలు భారం వేశారని అన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

చాతుర్మాస దీక్షలకు శారదా పీఠాధిపతి

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారిని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ డి. భ్రమ రాంబ, అధికార బృందం ఆయనకు ఘన స్వాగతం పలికారు. విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సింహగిరీశుని దర్శనానంతరం తాను, మా శిష్యుడు అయినటువంటి స్వాత్మా స్వరుపానంద స్వామి ఇరువురం కలసి చాతుర్మాస దీక్షకు ఋషికేసి వెళ న్నామన్నారు. జూలై 3వ తేదీ నుండి సెప్టెంబర్ 29 వరకు తాము దీక్షలో ఉంటామని అన్నారు.

భూముల రిజిస్ట్రేషన్లలో జాగ్రత్తలు తప్పనిసరి

విశాలాంధ్ర - కె.కోటపాడు: గ్రామ సచివాలయాల్లో నూతనంగా చేపడుతున్న భూముల రిజిస్ట్రేషన్లు తగిన జాగ్రత్తలతో చేపట్టాలని స్థానిక సబ్ రిజిస్టర్ బంగారి వెంకటేశ్వరరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మంగళవారం మండలంలోని గొందుపాలెం, కేకే అగ్రహారం గ్రామాల్లో సచివాలయ సిబ్బందికి రిజిస్ట్రేషన్‌లపై తగిన సూచనలు, సలహాలు అందజేశారు. పాత సర్వే నంబర్ల స్థానంలో ఎల్పీఎం నెంబర్లు వచ్చాయన్నారు. డాక్యుమెంట్‌లో ఎటువంటి చిన్న పొరపాట్లు ఉన్న ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఏవై పాత్రుడు, వీఆర్వో సబ్బవరపు ముత్యాల నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత పెరుగుతుంది

విశాలాంధ్ర - మల్కాపురం: యోగా చేయడం వల్ల ఏకాగ్రత పెరిగి, ఒత్తిడి తగ్గి, ఆరోగ్య వంతమైన జీవన విధానం అలవడుతుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యోగా తరగతులను ఆమె ప్రారంభించారు. యోగా ఒక జీవన విధానం అని, దానిని నిరంతరం అభ్యసించాలని అన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయ దేవి, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రోగ్రాం అధికారి ఎ.సంధ్యా రాణి, ఇతర ప్రోగ్రాం అధికారులు వి.అంజలీదేవి, ఎన్.నదియా, అధ్యాపకులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి సర్వేపై అవగాహన

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తిం చేందుకు సర్వే చేపట్టడానికి స్థానిక కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి కె.కరుణ ఆధ్వర్యంలో మంగళవారం ఆశ కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జూలై 16 వరకు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకుగాను ప్రభుత్వం ప్రత్యేక సర్వే కార్యక్రమం చేపడుతుందన్నారు. శరీరంపై స్పర్శ లేని తెల్లని మచ్చలు తదితరాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతి ఒక్క ఆశ కార్యకర్త, గ్రామ వాలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెల్త్ సూపర్వైజర్లు, హెచ్‌వీలు, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపడలో జగన్నాథ రథయాత్ర వేడుకలు

విశాలాంధ్ర - ముంచంగిపుట్టు: అల్లూరి జిల్లా ముంచింగి పుట్టు మండల పరిధిలో గల కొండపడ గ్రామంలో జగన్నాథ రథయాత్ర వేడుకలు అంగరంగ వైభవంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర మూర్తి దంపతులు పాల్గొని జగన్నాథుని రథాన్ని లాగి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. మానవుని మానసిక ఆనందం ఆధ్యాత్మిక చింతనతో ముడిపడి ఉంటుందని చెప్పారు. మనసు ప్రశాంతంగా ఉండాలంటే ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. జగన్నాథుని దర్శనం ప్రతి ఒక్కరికీ కలిగి ఆ స్వామి వారి దయ గిరిజన ప్రజలందరి పైనా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జగన్నాథని నవరాత్రులు ఉత్సవ కమిటీ సభ్యులు, ఎంపీడీఓ రమేష్, భక్తులు పాల్గొన్నారు.

ఊడేరులో రూ.కోటి జిరాయితీ భూమికి ఎసరు

- ఫోర్జరీ డాక్యుమెంట్లతో అక్రమ రిజిస్ట్రేషన్
- సహకరించిన రెవెన్యూ, సబ్ రిజిస్టర్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అధికారుల అవినీతి అండతో నకిలీ కేటుగాళ్లు పెట్రేగిపోతున్న సంఘటనలు జిల్లాలో అనేకం చోటు చేసుకుంటున్నాయి. ఖాళీగా భూమి కనిపించినా, లీజుకు తీసుకున్నా సరే.. నకిలీ దాక్యుమెంట్లు సృష్టించి కొట్టేయాలని దురాశ పెరిగిపోయి అడ్డదారులు తొక్కుతున్నారు. స్థిరాస్తిగా వచ్చే భూములను సైతం అడ్డగోలుగా కొట్టేయాలని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ సైతం చేయించి అమ్మేస్తున్న వైనం. దీనికి పూర్తిస్థాయిలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రర్స్, డాక్యుమెంట్ రైటర్స్ ప్రముఖ పాత్ర పోషించడం విశేషం. ఇలాంటి గలీజ్ పనులు చేస్తూ కటకటాలు లెక్కపెడుతున్నా మార్పు రాకపోవడం విడ్డూరంగా ఉంది. కోటి రూపాయలు విలువ చేసే జిరాయితీ భూమిని ఇంటిపేరు ఆసరాగా చేసుకుని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అమ్మేసిన సంఘటనపై బాధితుడు, గ్రామస్తులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి..

తాత, తండ్రి దగ్గరి నుంచి వస్తున్న సిరాస్తిని కొంతమంది నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, అక్రమ రిజిస్ట్రేషన్ చేయించి అమ్మేసిన వైనం అనకాపల్లి జిల్లా అనకాపల్లి మండలం ఊడేరు గ్రామంలో చోటు చేసకుంది. దీనికి సంబంధించి బాధితుడు సిరసపల్లి వెంకట్రావు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. ఊడేరు సర్వే నంబర్ 9/4లో 28 సెంట్లు జిరాయితీ భూమి సిరసపల్లి రామ్మూర్తి పేరు మీద ఉంది. ఆయన తదనంతరం కుమారుడు శిరసపల్లి అప్పలకొండ అనుభవంలో ఉన్నాడు. ఆయన తదనంతరము కుమారుడు వెంకట్రావు ప్రస్తుత అనుభవంలో ఉన్నాడు. అయితే కొద్ది కాలం క్రితం ఇదే భూమిని గ్రామానికి చెందిన గునుపుర్ రాములుకు లీజుకి ఇచ్చినట్లు తెలిపారు. కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 10న భూమికి సంబంధం లేని శిరసపల్లి సీతారామయ్య అనే వ్యక్తి పేరుతో నకిలీ 1బి సృష్టించి, అదే రోజున దాడి రోహిత్‌కు రిజిస్ట్రేషన్ కూడా చేసినట్లు తెలిపారు. తాత తండ్రుల దగ్గర నుంచి వస్తున్న సిరాస్తిని కాజేయాలని దురాశతో గ్రామానికి చెందిన మా ఇంటి పేరుతో ఉండే మరొక వ్యక్తికి 1బి మంజూరు చేసి మా భూమిని అమ్మడం దారుణమని వాపోయారు. నకిలీ డాక్యుమెంట్ సృష్టించి భూమిని అమ్మిన శిరసపల్లి సీతా రామయ్యపై, అతనికి సహకరించిన లీజు దారుడు గునుపూరు శ్రీరాములు, ఆయన ముగ్గురు కుమారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరారు. భూమి ధరలు పెరగడం, లీజుదారుడు సదరు భూమిపై కన్నేయడం వెరసి కొంతమంది భూమాయ ముఠాతో కలిసి జిల్లాలోని ఇలాంటి నకిలీ పనులకు పాల్పడు తున్నారని నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మండల పరిషత్ సమావేశానికి ఉద్యోగుల గైర్హాజరుపై మంత్రి ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: మండల ప్రజా పరిషత్ ఎనిమిదవ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అమర్నాథ్ ఉద్యోగుల గైర్హాజరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరందరికీ మెమోలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనకాపల్లిలో జగనన్న ఇళ్ల కాలనీ నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అధికారులను ఆదేశించారు. 5,063 జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలలో కానీ, లబ్దిదారుల సొంత స్థలాల్లో నిర్మించే ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ప్రతి ఇంటి నిర్మాణానికి లక్షా ఎనభై వేల రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని, అవసరమైతే 20వేల రూపాయలు అడ్వాన్స్‌గా కూడా మంజూరు చేయనున్నామని మంత్రి తెలియజేశారు. సొంత స్థలాలలో ఇళ్లు నిర్మించుకోదలచిన వారికి ఎల్పీసీలు పెండింగ్లో ఉంటే వాటిని కూడా త్వరలోనే మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అర్హత ఉండి ఇళ్ల పట్టాలు రాని వారిని గుర్తించి, 90 రోజుల్లోగావారికి పట్టాలు అందేలా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సచివాలయానికి అభివృద్ధి కార్యక్రమాల కోసం 20 లక్షలు మంజూరు చేస్తున్నామని, ఆ మొత్తానికి సంబంధించిచేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని అమర్నాథ్ ఆదేశించారు. ఈనెల 23వ తేదీ నుంచి జగనన్న సురక్ష పథకం అమలులోకి రాబోతుందని, వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అర్హత ఉండి పథకాలు అందని వారి జాబితాలు తయారు చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. జల జీవన్ మిషన్ కింద ఇప్పటికే నియోజకవర్గంలో 24,212 ఇళ్లకు వ్యక్తిగత కొళాయిలు మంజూరు చేసామని మంత్రి అమర్నాథ్ చెప్పారు. ఇప్పటికే ఈ పథకంలో భాగంగా 21.5 కోట్ల రూపాయల పనులను చేపడుతున్నామని ఇందులో 10.5 కోట్ల రూపాయల పనులు టెండర్ల స్థాయిలో ఉన్నాయని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా మండలంలోని అన్ని అంగన్వాడీ సెంటర్లలో టీవీలు ఏర్పాటు చేసేందుకు సమావేశం నిర్ణయించింది. ఇందుకోసం 20 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు మంత్రి చెప్పారు. మండలంలోని అంగన్వాడీ సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు 1.30 కోట్ల రూపాయలు కేటాయించామని మంత్రి అమర్నాథ్ వివరించారు.

పనితనం ఆధారంగా పోస్టింగ్...

టౌన్ ప్లానింగ్‌లో సీసీపీ పట్టు బిగింపు...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గాడి తప్పిన ప్రణాళిక విభాగాన్ని ప్రక్షాళన చేసే పనిలో భాగంగా ఇటీవల నూతన చీఫ్ సిటీ ప్లానర్‌గా బాధ్యతలు చేపట్టిన సునీత తనదైన శైలిలో పనితనం ఆధారంగా జీవీఎంసీలో ఉన్న ఎనిమిది జోన్లులో అంతర్గత బదిలీలు చేపట్టినట్లు తెలుస్తుంది. గతంలో డీసీపీగా పనిచేసిన అనుభవం ఆమెకు ఉండడంతో నగరంలో ప్రణాళిక విభాగం ప్రక్షాళనకు నడుం బిగించారు. గతంలో పనిచేసిన సీసీపీలు కొంతమందికే అందలం ఎక్కించారన్న అపవాదులను తొలగించే క్రమంలో కొత్త సీసీపీ నూతన ఒరవడితో ప్రక్షాళన చేపట్టారు. గత వారం రోజుల్లో పలువురు అధికారులను చేర్పులు మార్పులకు శ్రీకారం చుట్టారు. ఉన్నత రాజకీయ సిఫార్సులతో బదిలీపై వచ్చిన అధికారులను వారికి ఇష్టమైన జోన్లను కేటాయించ కుండా పనితనం ఆధారంగానే వారికి జోన్ల బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తుంది.

తాజా మార్పులతో బదిలీలు....

డిసిపి1 టి.నరేంద్ర నాథ్ రెడ్డికి జోన్ 1,2,3,4 అప్పగించగా, డీసీపీ 2 కె.పద్మజకు జోన్ 5, 6,7,8 బాధ్యతలు అప్పగించారు. భీమిలి జోన్ 1 ఏసీపీగా డి.శ్రీనివాసరావు, టీపీబీఓగా మూర్తి శ్రీ, మధురవాడ జోన్ 2లో ఏసీపీగా కె.వెంకటేశ్వరరావు, టీపీఓగా ఎస్.వరప్రసాదరావు, టిపిఎస్‌గా కే.ఝాన్సీ, జోన్ 3 ఆశీల్‌మెట్టలో ఏసీపీగా సథన శాస్త్రి, టిపివో డి.తేజేశ్వరరావు, టిపిఎస్‌గా సిహెచ్ అనితను నియమించారు. జోన్ 4 సూర్య బాగ్‌లో ఇన్చార్జి ఎసిపిగా ఎస్.వినయ్ ప్రసాద్, టిపిఓగా సిహెచ్ పార్థసారథిని నియమించారు.

ఇక జోన్ 5 జ్ఞానాపురంలో ఇంచార్జ్ ఏసీపీగా సిహెచ్ రఘునాథరావు, టిపిఓగా ఎం.శ్రీలక్ష్మిని, జోన్ 6 గాజువాకకు ఏసీపీగా ఎస్.మహా పాత్రో, టిపిఓగా ఎన్.రేవతి, టిపిబిఓగా వై.హేమంత్ కుమార్‌ను నియమించారు. జోన్ 7 అనకాపల్లిలో ఎసిపిగా ఎం.అరుణ వల్లిని, టిపిఎస్‌గా జి.విజయ్ కుమార్‌ను, టిపిబిఓగా ఎంపి జనార్దన్‌రావును నియమించారు. జోన్ 8 పెందుర్తిలో ఏసీపీగా కె.జయరాంను, టిపిఓగా సిఎస్ ప్రవీణ్ కుమార్‌ను, టిపిఎస్‌గా పి.ప్రమీల రాణిని నియమించారు. అయితే ఇటీవల బదిలీల్లో జి.విజయకుమార్‌ను సాలూరుకు, పి.ప్రమీలరాణీని శ్రీకాకుళంకు బదిలీ చేసినప్పటికీ వారు జీవీఎంసీలోనే కొనసాగడం విశేషం.

తహాశీల్దార్‌ని కలిసిన జెడ్పీటీసీ పీఎస్ రాజు

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండల తహశీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వి.కనకారావును జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ బూన అప్పలరాజు, వెన్నెలపాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు, కన్నూరు ఎంపీటీసీ కన్నూరు శ్రీను, నాయకులు రాజశేఖర్, సప్ప సన్యాసిరావు, బుగిడి గోవిందరావు, బండారు శ్రావణ్ పాల్గొన్నారు.

జగన్నాథ స్వామిని దర్శించుకున్న బెహరా భాస్కరరావు

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 91వ వార్డు పాత గోపాలపట్నం గొల్ల వీధిలో శ్రీశ్రీశ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్ర మహోత్సవంలో జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎస్ రాజు, బెహరా సుభాకరరావు, బల్లంకి వెంకట్రావు, ముమ్మన సత్యనారాయణ, పసుపురెడ్డి రమణ, పాము వేణు, సాలాపు మంగరాజు, కోరాడ శ్రీను, నైదాన రామకృష్ణ, గొలగాన రాజు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థినీలకు నగదు ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర - ఆనందపురం: జగనన్న ఆణిముత్యాలలో భాగంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదగా ఆనందపురం మండలం కస్తూరిబా గాంధీ విద్యార్థినీలు రాష్ట్రస్థాయి నగదు ప్రోత్సకాలు అందుకున్నారు. ఇందులో భాగంగా 10వ తరగతి ఫలితాలు ఎస్.భారతి 588 మార్కులు, ఈ.రేవతి 585 జగనన్న ఆణిముత్యాలకు పాఠశాల నుండి అలాగే నియోజవర్గం నుండి బహుమతులు తీసుకున్నారు. ఇరువురి విద్యార్థులు విశాఖ జిల్లాలో కాంపిటీషన్లో మొదటి బహుమతి 50,000 వేలు, రెండో బహుమతి 10,000 రూపాయలు అందుకున్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో 75,000, 50,000 ఒకటో రెండో బహుమతులు నగదు ప్రోత్సాహకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీలతోపాటు కస్తూరిబా గాంధీ ప్రిన్సిపాల్ చంద్రకళ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో అవకతవకలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వెల్లడైంది. ఒక్క శ్రీరాంపురం గ్రామంలోనే సుమారు లక్ష రూపాయలకు పైగా అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. కుమారపురంలో చనిపోయిన వ్యక్తిపై వేతనాలు డ్రా చేశారు. శ్రీరాంపురం గ్రామంలో ఉపాధి పనులు చేసిన వాళ్లు సంతకాలు వచ్చినా వేలిముద్రలు తీసుకోవడం, అధికారులు అనుమతులు లేకుండా ఇద్దరు మేట్‌లను తొలగించడం తదితర అంశాలను ప్రజావేదికలో వెల్లడించారు. దీనిపై విఆర్‌పి బత్తిన వాసును అధికారులు వివరణ కోరారు. అరట్లకోటలో గ్రామసభ ప్రజలకు తెలియజేయలేదంటూ పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సామాజిక తనిఖీల్లో విఆర్‌పిలు తప్పులు చేసినట్లు తేలినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ అధికారులను ప్రశ్నించారు. 2022 నుండి ఏప్రిల్ 1వ తేదీ నుండి 2023 మే 31వ తేదీ వరకు మండలంలోని 24 గ్రామాల్లో జరిగిన రూ.5.25కోట్లతో 899 పనులకు సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు విచారణ నిర్వహించి సుమారు రూ.3.23లక్షలు రికవరీ చేయాలని అధికారులు ప్రజావేదికలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పిడి రోజారాణి, ఎపిడి శ్రీనివాస్, దివ్య, ఎంపీడీఓ సాంబశివరావు, ఏపీఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

యోగా డే సందర్భంగా బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - భీమిలి: జూన్ 21వ తేదీ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్క రించుకొని భారత స్వాభీమాన్ ట్రస్ట్, పతంజలి యోగాసమితి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించినట్టు విశాఖపట్నం భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు టి.ఎస్.వి.ప్రసాదరావు తెలిపారు. ఈ ర్యాలీ విశాఖపట్నం స్థానిక వీధుల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి నిర్వహించామన్నారు. ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, కార్యాలయాల్లో, ప్రైవేట్ సెక్టార్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో, వార్డులలో, పార్కుల్లో, తమ దగ్గర ట్రైనింగ్ పొందిన ట్రైనీ టీచర్స్‌తో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రోటోకాల్‌ను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు సాయి నాగేశ్వరరావు, పతంజలి యోగ సమితి జిల్లా కార్యవర్గం, పతంజలి డివిజన్ యోగా కార్యకర్తలు నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, ప్రభాకర్, సత్యనారాయణ, ప్రభాకర్ మూర్తి, బాలరాజ్, రవికుమార్, శైలజ, పశువులత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పురస్కారాలు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ అముజూరి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా స్థానిక ఎంపీపీ రాంబాబు, ఎంఈఓ శివరాణి రిటైర్డ్ మాస్టర్ సన్యాసిరాజు పాల్గొన్నారు. ఈ పాఠశాలకు నూతనంగా వచ్చిన 12 మంది టీచర్లను ఆహ్వానించగా ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన టీచర్లకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ రాంబాబు మాట్లాడుతూ ప్రాథమిక ఉన్నత పాఠశాలను జిల్లా పరిషత్ పాఠశాలగా మార్చిన ఘనత అముజూరి అప్పారావుకే దక్కుతుందని అన్నారు. అమజూరి అప్పారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు చొరవతో స్కూల్లో ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి జిల్లా పరిషత్ పాఠశాల స్థాయికి తీసుకు రాగలిగామని అల్లూరి సీతారామరాజు పుట్టిన ఈ గడ్డమీద మొదటి సంవత్సరం 10వ తరగతి ఫలితాలు అత్యుత్తమంగా వచ్చాయని అన్నారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘనంగా సన్మానం చేశారు. ఎంపీపీని శాలువాతో శ్రీ అల్లూరి సీతారామరాజు ఫీల్డ్ ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిన్నింటి నారాయణమ్మ, నాయకులు పాలూరి అప్పలనాయుడు, స్థానిక టీచర్ ఆదినారాయణ మాస్టారు, స్కూల్ చైర్మన్లు, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీస్తున్న ఎంపీ ఎంవీవీ విశాఖను వీడాలి

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ ఎంపీ ఎంవీవీ ఇంట జరిగింది కిడ్నాప్ కాదని, ఆయన వ్యాపార రీత్యా విశాఖ వదిలేయటం విశాఖ ప్రాంత ప్రజలకు మంచిదేని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. మంగళవారం పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీసే ఆయన విశాఖలో ఉండాల్సిన అవసరం లేదన్నారు. కబ్జాలు, ఆక్రమణలు లేకుండా ఏ వెంచర్ చేయని ఎంవీవీ బాధితులు ఎందరో ఉన్నారన్నారు. నగరం నడిబొడ్డున మైనింగ్ చేస్తామంటే 24 గంటలు అనుమతులు ఎలా ఇస్తారని, ఇది అరాచకం కాదని, ప్రజాస్వామ్యం అని ఎంపీగా ఉన్న ఎంవీవీ గుర్తించాలన్నారు. ఎంపీ కాకముందు ఆయన భూకబ్జా కేసులో అరెస్టయి విశాఖ జైల్లో ఉన్న మాట నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ వైసిపి నాలుగేళ్ళ పాలనలో ఉత్తరాంధ్ర మరో పదేళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. విశాఖలో భూ కుంభకోణాలపై సీబీఐ వేయాలని పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. విశాఖపట్నం లోక్ సభ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ ఇంట జరిగిన కిడ్నాప్ వ్యవహారంపై సిబిఐ, ఈడీల నేతృత్వంలో సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నాం అన్నారు. ఎంపీ భార్య, కుమారుడు, సన్నిహితుడైన ఆడిటర్ జీవీలది అసలు కిడ్నాప్ ఏ కాదని, అక్రమ లావాదేవీలకు సంబంధించిన సెటిల్మెంట్ అని ఆరోపణలు వస్తున్నాయన్నారు. క్రైస్తవ భూములను కాజేశారని, పోతినమల్లయ్యపాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా ఎంవివి సిటీలో పలు అక్రమాలు జరిగాయని, వీటన్నింటిపైన విచారణ జరపాలని, ఎంవీవీ ఇంట జరిగిన కిడ్నాప్ వ్యవహారంలో అసలైన నిందితులను కూడా అరెస్టు చేయాలని తద్వారా విశాఖలో శాంతిభద్రతలను పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నాం అని తెలిపారు.

దొంగతనాల కేసులలో రికవరీ శాతం పెరగాలి

ఎస్పీ మురళీకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: దొంగతనాలు కేసులలో రికవరీ శాతం పెరగాలని, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది నేరస్తులను పట్టుకోవడంలో మరింత శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి, ఆయా కేసుల దర్యాప్తు పెండింగులో ఉండదానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మిస్సింగ్ కేసులు, ఆచూకీ తెలియని మృతదేహాల కేసులు, పోక్సో కేసులు సమగ్రంగా దర్యాప్తు చేయాలని, సాంకేతిక సహాయంతో ఆధారాలు సేకరించాలన్నారు. దర్యాప్తు అధికారులకు సబ్ డివిజన్ అధికారులు మార్గ నిర్దేశం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రమాదాలు సంభవించినప్పుడు దర్యాప్తు అధికారులు క్రైమ్ సీన్‌కు వెళ్ళి కొత్త బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, ప్రమాదాలు కారణాలు కనుగొని ప్రత్యేక కార్యచరణ రూపొందించి, నేషనల్ హైవే, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో అమలు చేయడం ద్వారా తిరిగి అటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. యాంటీ డ్రగ్ ట్రాఫికింగ్ మరియు సైబర్ క్రైమ్ లకు సంబంధించి ఎక్కువమంది యువత పై ప్రభావం చూపించే అవకాశం ఉన్నందున వాటిపై గ్రామ మహిళా పోలీసుల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతిభ కనబరిచిన 23మంది అధికారులు, సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణ రావు, నర్సీపట్నం సబ్ డివిజన్ అదనపు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఐపీఎస్., అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ వి.సుబ్బరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, అనకాపల్లి దిశా డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, లక్ష్మణ్ మూర్తి, పైడపునాయుడు, అప్పలనాయుడు, రామకృష్ణారావు, వెంకటరావు , ఎస్సైలు భీమరాజు, రఘువర్మ , జిల్లా సిఐలు , ఎస్సైలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం దిశగా సంక్షేమ పాలన: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జి.మాడుగుల: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పాలన సాగుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్య లక్ష్మి అన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో అర్హత ఒక్కటే ప్రామాణికంగా పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అండగా ఈ ప్రభుత్వం నిలుస్తోందని ఆమె చెప్పారు. జి.మాడుగుల మండలం వంతల గ్రామ సచివాలయం పరిధిలోని చింతగొంది, గర్రాయి, సిరిపురం గ్రామాలలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 98 గడపలను శాసనసభ్యులు సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లంకెల కళ్యాణ్, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, గెమ్మెలి సర్పంచ్ ఎస్.కొండబాబు, లువ్వాసింగి ఎంపీటీసీ జి.సన్యాసి దొర, సచివాలయం కన్వీనర్ పి.మహేష్ బాబు, పి.రమణమూర్తి, గృహసారథులు మాధవి రాణి, సింహాచలం, వార్డు మెంబర్ వంగల రాజులమ్మ, వైసీపీ సీనియర్ నాయకులు వి.బాలకృష్ణ, కే.వెంకటేష్ పడాల్, ఐ.రాంబాబు, టి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం పూర్తి చేయాలి

విశాలాంధ్ర - జికె వీధి: జికెవీధి మండల కేంద్రంలో గల బాలికల ఆశ్రమ పాఠశాలలో అసంపూర్తిగా నిలిపివేసిన నాడు నేడు పాఠశాల భవనాన్ని పూర్తి చేసి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిల ఇబ్బందులను తొలగించాలని, అలాగే పాఠశాలలో ప్రహరీ గోడ శిథిలావస్థకు చేరుకుందని, వెంటనే పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని జికెవీధి మండల టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు గుంట బుజ్జిబాబు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అలాగే ఏకలవ్య ఆశ్రమ పాఠశాల, గురుకుల కళాశాలలో చదువుకునే విద్యార్థులకు సీట్లు రాక విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, అందుకు ఏకలవ్య ఆశ్రమ పాఠశాల, గురుకుల కళాశాలలో సీట్ల సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టిడిపి కార్యదర్శి ముక్కలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుదల నిలుపు చేయాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: విద్యుత్ ఛార్జీల పెంపుదల నిలుపు చేయాలని, ట్రూ అప్, సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయాలని మండల సిపిఎం పార్టీ స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గండి నాయన బాబు మాట్లాడుతూ ప్రభుత్వం కరెంట్ బిల్లులతో సామాన్యులకు షాక్ ఇచ్చిందన్నారు. ప్రజల కళ్ళుగప్పి దొడ్డిదారిన చార్జీలు పెంచిందని ఆరోపించారు. రానున్న స్మార్ట్ మీటర్లతో మరో ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యుడిని దోచి కార్పొరేట్ల జేబులు నింపుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలపై నియంత్రణ చేయలేకపోతున్నాయని అన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్ర దేవుడు, వనము సూర్యనారాయణ, శెట్టి రమణ, కండిపల్లి సహదేవుడు, శెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

విశాలాంధ్ర - పెదబయలు: అల్లూరి జిల్లా పెదబయలు మండలం తహశీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్ని నెలలుగా పెదబయలు తహశీల్దార్ కార్యాలయంలో పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల పరిపాలన మందగించిందన్నారు. ఈ మధ్యకాలంలో మండలంలో ఉన్నటువంటి గిరిజనులు, గిరిజన నిరుద్యోగులు విద్యార్థులు, కేస్ట్ సర్టిఫికెట్, ఇన్కమ్ సర్టిఫికెట్ అవసరమై ఉన్నప్పటికీ పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం వల్ల పూర్తిస్థాయిగా సర్టిఫికెట్లు అన్నీ పెండింగ్లో ఉండిపోయాయన్నారు. వెంటనే ప్రభుత్వం, జిల్లా స్థాయి అధికారులు స్పందించి పెదబయలు మండల తహశీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న తహశీల్దార్ పోస్టును, డిప్యూటీ తహశీల్దార్ పోస్ట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీత గట వైస్ సర్పంచ్ గంగాధరం పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టి లోయలో పడ్డ కారు

విశాలాంధ్ర - గొలుగొండ: కొయ్యూరు మండలం రామనాపల్లి, నడిం పాలెం ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు విధులు ముగించుకొని నర్సీపట్నం వెళుతుండగా గొలుగొండ ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల సమీపంలో తాటి చెట్టును ఢీ కొట్టి కారు లోయలో పడిపోవడం జరిగింది ఈ ప్రమాదంలో సంధ్య, అనే ఉపాధ్యాయులకు కాలు ఫ్యాక్చర్ కాగా సునీత ఉపాధ్యాయులు కారు ప్రమాదం షాక్ లో ఉండిపోయారు గాయాలు అయిన వారిని స్థానికులు గొలుగొండ పిహెచ్సికి తరలించారు అయితే మెరుగైన వైద్య నిమిత్తం నర్సీపట్నం ఏరియా హాస్పిటల్ కి తరలించారు మిగిలిన వారికి స్వల్ప గాయాలు అయినట్టు తెలిసింది అయితే ఈ ప్రమాదానికి కారణాలు డ్రైవింగ్ చేస్తున్న సోమయ్య మాస్టారుకు కళ్ళు తిరగడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

ఐటీడీఏ పీఓను కలిసిన జెడ్పీ సీఈఓ

విశాలాంధ్ర - రంపచోడవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన జడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరేను కలిశారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ద్వారా ఏజెన్సీ అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎంపీడీవో జాన్ విల్‌టన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి

విశాలాంధ్ర - రంపచోడవరం: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్లోని వై.రామవరం మండలం చింతలపూడి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు సమాచారం. చింతలపూడి గ్రామానికి చెందిన రేవుల రమేష్ రెడ్డి (23) కత్తుల వీరప అనే వ్యక్తులు చింతలపూడి నుండి బంధువుల గ్రామమైన ఇవంపల్లి గ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏకేసీ కాలనీలో ఇళ్ల పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర - మల్కాపురం: నవ రత్నాలు పేదలం దరికీ ఇల్లు పథకంలో భాగంగా పశ్చిమ నియోజకవర్గం 40వ వార్డు ఏకేసీ కాలనీలో 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అర్హులం దరికీ సంక్షేమ పథకాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆడారి ఆనంద్ కుమార్‌తోనే పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ప్రజలు పాల్గొన్నారు.

గిరి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: గిరి విద్యార్థులు విద్యపై ప్రత్యేక దృష్టిసారించి ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జెడ్పీటీసీ సిహెచ్ జానకమ్మ చెప్పారు. మండలంలోని అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అరుకు సర్పంచ్ శారదా, ఎంపీటీసీ వరాహలమ్మ, వైసిపి మండల నాయకులు సింహాచలం, సిహెచ్ కృష్ణారావు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు కేజీకి రూ.16 బోనస్ ఇవ్వాలి

విశాలాంధ్ర - జికెవీధి: కాఫీ రైతులకు కనీసం కేజీకి 16 రూపాయల బోనస్ ఇవ్వాలని బిజెపి మండల అధ్యక్షులు వనపల జోగిరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కాఫీ పండ్లకు కేజీకి 36 రూపాయలు ఐటిడిఎకొనుగోలు చేసిందని, ప్రైవేటు వారు కేజీకి రూ.50కు కొనుగోలు చేశారన్నారు. కన్నతల్లిని నమ్ము కుంటే కడుపుకు ఆకలి మిగిలింది అన్నట్లుగా బోనస్ రూపంలో కేజీకి ఎనిమిది అని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా కనీసం కేజీకి రూ.16 బోనస్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు మొట్టడం లక్ష్మణ్, ఎఫ్‌పిఒ ట్రెజరర్ పొత్తూరి బుజ్జిబాబు, కాకురి వెంకటరమణ పాల్గొన్నారు.

అవంతిలో ఎంసీఏ కోర్సు

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవం పాలెంలో అవంతి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి రెండు సంవత్సరాల ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ ఆప్లికేషన్స్) కోర్సు ప్రారంభించుటకు ఏఐసిటిఇ అనుమతి మంజూరు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహనరావు తెలిపారు. 120 సీట్లకు ఈ సంవత్సరం నుండి అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. ఇంటర్‌లో గానీ, డిగ్రీలో గానీ మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్టు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సుకు అర్హులని పేర్కొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - చింతపల్లి: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంతల సుబ్బారావు, కంకిపాటి వీరన్నపడల్, ఆదివాసీ విభాగం రాష్ట్ర షెల్ కో ఆర్డినేటర్ వంతల గోపినాథ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల సందర్భంగా స్థానిక పాత బస్‌స్టాండ్ కూడలిలో దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రాంతీయ పార్టీలు అధికారం కోసం ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కానీ హామీలు గుప్పించి ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బిజెపి, వైకాపాలు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సంక్షేమం ముసుగులో సర్వం చూస్తున్న ఈ ప్రభుత్వాలను సాగనంపే సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జీకే వీధి మండల అధ్యక్షుడు కిల్లో చిరంజీవి, మాజీ సర్పంచ్ లు సాగిన కృష్ణ పడాల్, పెనుమాల కాంతమ్మ, సాగిన అప్పలమ్మ, పాంగి రామకృష్ణ, మత్రి అప్పారావు, రీమల రాజేష్, మొట్టడం.బాలరాజు, చింతర్ల అగ్గిరాముడు, కోన యల్లారావు, గెమ్మెలి రామ చంద్రరావు, బొరుబోజి సన్యాసిదొర, మత్రి గురుమూర్తి, పాంగి శ్రీనుబాబు, కొర్ర సుందరరావు, మోజేశ్, బుజ్జిబాబు, మోహన్, గెమ్మెలి సింహాచలం, శెట్టి ప్రసాద్, నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఏజెన్సీ అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలి

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీని అభివృద్ధి చేయుటకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీఎంఆర్సీ సమావేశపు హాలులో సోలార్ వీధి లైట్ల పంపిణీలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి పరిచే విధంగా కృషి చేయాలని కోరారు. పుల్లంగి, చావడికోట, బోలకొండ, రంపచోడవరం, అనిగేరు, ఆకూరు, వేములకొండ, మత్రిపాలెం తదితర పంచాయ తీలలో 100 సోలార్ వీధిలైట్లు ఆయా గ్రామాలకు ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని అన్నారు. ఇంకా మారుమూల గ్రామాలకు ఇటువంటి సోలార్ వీధిలైట్లు వివిధ రకాలైన ఎన్జీవోలు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసి మహాసభ సంస్థ కార్యదర్శి జి.చిన్నారావు, సహాయకులు ఐ.సూర్య నారాయణ, న్యాయవాది ఏవి సత్యనారాయణ, చెన్నారెడ్డి, వీరభద్ర రెడ్డి, పాండవులు తదితరులు పాల్గొన్నారు.

1760 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - జి.మాడుగుల: ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఒక ఇంట్లో ఉంచిన 1760 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు పాడేరు ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం కృష్ణా జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన బి.సురేష్ చెన్నైలో ఎన్సీబీ అధికారులకి 160 కేజీల పట్టుబడటంతో ఎన్సీబీ అధికారులు అతని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాడేరు ప్రాంతంలో సుందర్రావు అనే వ్యక్తి నుండి కొన్నట్లు తెలపడంతో చెన్నై ఎన్సీబీ అసిస్టెంట్ డైరెక్టర్ ఉత్తరులతో ఒక ప్రత్యేక బృందం సుందరావుని పట్టుకోవడానికి పాడేరు వచ్చి పాడేరు ఎస్పీ, ఏ.ఎస్.పి సూచనల మేరకు 20వ తేదీ ఉదయం జి మాడుగుల సిఐ, ఎస్సై, పెదబయలు ఎస్సై వారి సిబ్బంది, ఎన్సీబీ టీంతో పూర్తి సమాచారంతో పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ గిన్నె గరువు గ్రామంలో గొల్లూరి సుందర్రావు ఇంటి వద్దకు ప్రైవేటు వాహనంలో వెళ్లి ఇంటిని తనిఖీ చేయగా పట్టుబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, ఎస్సైలు శ్రీనివాస్, మనోజ్ కుమార్, పోలీస్ సిబ్బంది సత్యారావు, అప్పలరాజు, హేమంత్ కుమార్, బాలకృష్ణ, పోలీస్ సిబ్బందిని ఏఎస్పీ ధీరజ్ అభినందించారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

విశాలాంధ్ర - హుకుంపేట: హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 14 సచివాలయాలు 9 సబ్ సెంటర్లుకు సంబంధించిన గ్రామాలలో కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగిందని స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ సుమన తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్వైజర్స్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వాలంటీర్లకు కుష్టు వ్యాధి నివారణకు వాటి చర్యలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుండి వచ్చేనెల 16వ తేదీ వరకు గ్రామాల్లో ప్రతి ఇంటింటికి వెళ్లి మహిళలకు ఆశ కార్యకర్త, పురుషులకు వాలంటీర్లు ప్రజలు దగ్గర వెళ్లి ప్రతి వ్యక్తి తల నుండి కాళ్లు వరకు తెల్ల మచ్చలు ఎక్కడెక్కడ ఉన్నాయి అనేది నిర్ధారించి వాటి జాబితా తయారుచేసి వైద్యాధికారులకు అందజేస్తారని అన్నారు. వారిని వ్యాధి నిర్ధారణ పరీక్ష నిమిత్తం విజయవాడకు పంపించి జబ్బు నిర్ధారణ అయితే వ్యాధి తగుముఖం చర్యలపై చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ జమ్మి, పిహెచ్ఓ పేర్చి, హెల్త్ సూపర్వైజర్స్, ఏఎన్ఎం, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప-గడపకు మన ప్రభుత్వం

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్

విశాలాంధ్ర - మాకవరపాలెం: సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మాకవరపాలెం మండలం జి.కోడూరులో రెండో రోజు మంగళ వారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకొను సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఇంకా అర్హులైన వారు ఎవరైనా ఉంటే వారికి కూడా సంక్షేమ ఫలాలు అందిస్తామని చెప్పారు. అలాగే ప్రతి కుటుంబానికి గడిచిన నాలుగేళ్ల కాలంలో ఎంత లబ్ధి పొందిందో వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అయన చెప్పారు. ఆయా గ్రామాలకు సంక్షేమ అభివృద్ధి పేరుతో మంజూరైన నిధుల వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రుత్తల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు రుత్తల శ్రీనివాస్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన జగన్నాథుని రథయాత్ర

విశాలాంధ్ర - అనకాపల్లి: శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్ర మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది.స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం రథంలో స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్లమెంట్ సభ్యురాలు బీ శెట్టి వెంకట సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, వైసిపి పార్లమెంట్ పరిశీలికలు దాడి రత్నాకర్ దంపతులు, ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి వారి కి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథయాత్ర ను ప్రారంభించారు.జగన్నాథ స్వామి నుండి రథోత్సవం గవరపాలెం, సంత బయలు, చిన్న రామస్వామి గుడి, పెద్ద రామస్వామి గుడి, పార్క్ సెంటర్, మెయిన్ రోడ్, చింతా వారి వీధి, పెరుగు బజార్ , గాంధీభవన్ జంక్షన్, మల్ల వీధి మీదగా గూడ్స్ రోడ్డు వద్ద ఉన్న ఇంద్రజ్యూహలు కు చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో. కార్పొరేటర్లు పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, కొణతాల నీలిమ భాస్కర్, ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ, ఆలయ మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు. భక్తులు తదిరులు పాల్గొన్నారు

అత్యాధునిక ట్కైల్ ఫిక్సింగ్‌పై రోఫ్ పిడిల్కైట్ ప్రచారం

విశాలాంధ్ర/విశాఖపట్నం: నిర్మాణ, రసాయనాల తయారీలో అగ్రగామిగా ఉన్న పిడిల్కైట్.. ట్కైల్ ఫిక్సింగ్ కోసం ట్రెడిషనల్ సెలక్షన్ ఉపయోగించడం వల్ల కలిగే పరిణామాలపై అవగాహనను పెంచే కొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు పిడిల్కైట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ సుధాన్సు వాట్స్ తెలిపారు. సిమెంట్‌తో సహా సంప్రదాయ ట్కైల్ ఫిక్సింగ్ పద్ధతుల ఫలితంగా పగిలిన ట్కైల్స్, డీబాండిరగ్, పడిపోతున్న ట్కైల్స్ అనస్తీటిక్‌తో కస్టమర్ నిరాశను ప్రచారం వివరిస్తుందని పేర్కొన్నారు. ట్కైల్స్ వాడకం గత కొన్ని దశాబ్దాలుగా గణనీయమైన మార్పుకు గురైందన్నారు. సంప్రదాయ ట్కైల్-ఫిక్సింగ్ పద్ధతులకు కట్టుబడి ఉండటం వల్ల కొత్త-యుగం కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా ఉండకపోవచ్చన్నారు. తమ బ్రాండ్ రోఫ్ భారతదేశంలో ట్కైల్స్ బిగించే విధానాన్ని మార్చే లక్ష్యంతో ఉందన్నారు.

22న ఆదర్శ్‌లో ఐసీఐసీఐ బ్యాంకు జాబ్ మేళా

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో ఐసిఐసిఐ బ్యాంక్‌లో ఉద్యోగాలకు జూన్ 22న ఉదయం 10 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారని కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్.ఈ. ఫ్లోరా తెలిపారు. ఐసిఐసిఐ పర్మినెంట్ ఆన్ రోల్ ఉద్యోగం అయిన "రిలేషన్ షిప్ మేనేజర్" ఉద్యోగానికి 25 సంవత్సరాలు లోపు వయస్సు కలిగిన 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు 50 శాతం మార్కులు కలిగిన యువతి, యువకులు అర్హులని తెలిపారు. బిఎ, బిబిఎ, బీకాం, బిఎస్సి, బిసిఎ డిగ్రీ పూర్తిచేసిన, డిగ్రీ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులని, జీతం సంవత్సరానికి 2.6 లక్షలు నుండి 3.0 లక్షలు వరకు వుంటుందని, ఆంధ్రప్రదేశ్ లో ఉద్యోగం చేయాలని కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాస్ రావ్ తెలిపారు.ఆసక్తి, అర్హత కలిగిన యువతి, యువకులు బయోడేటా ఫామ్, సర్టిఫికేట్స్ జిరెక్స్, ఆధార్ కార్డ్ వర్జినల్, జిరెక్స్, 2 ఫొటోస్ తో పాటు ఫార్మల్ డ్రస్ లో ఇంటర్వ్యూకి పెందుర్తి లోని ఆదర్శ్ డిగ్రీ కళాశాల డిజి సెమినార్ హల్ లో హాజరు కావాలని, ఈ సువర్ణ అవకాశాన్ని వివిధ కళాశాలలకు చెందిన యువతి, యువకులు ఉపయోగించుకోవచ్చునని ఆదర్శ డిగ్రీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి. థియోఫిలస్ తెలియజేసారు. మరిన్ని వివరాలకు 9182020936 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అన్ అకాడమీ విద్యార్థులకు ర్యాంకులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అన్ అకాడమీకి చెందిన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023 పరీక్షలో ప్రతిభ కనబరిచారు. టాప్ 100లో 11 ఆల్ ఇండియా ర్యాంక్లు సాధించిందన్నారు. ఆ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023 పరీక్షలో 5 అన్ అకాడమీ విద్యార్థులు జోనల్ టాపర్లుగా మెరిశారని, అన్ అకాడమీ విద్యార్థి దేశాంక్ ప్రతాప్ అద్భుతమైన ప్రదర్శన ద్వారా ఐఐటీ ఢిల్లీ జోన్లో అత్యుత్తమ ఆల్ ఇండియా ర్యాంక్ అయినటువంటి 22 జోనల్ ర్యాంక్ 5ని సాధించాడన్నారు. ఇతర విద్యార్థుల్లో ధృవ్ జైన్ ఆల్ ఇండియా ర్యాంక్ 36 ఐఐటీ ఖరగ్పూర్ జోన్లో ర్యాంక్ 1, అదే జోన్ లో ఆల్ ఇండియా ర్యాంక్ 42, ఖరగ్ పూర్ జోన్ లో ర్యాంక్ 3 సాధించారన్నారు. శివాంశు కుమార్. నిపున్ గోయల్ ఆల్ ఇండియా ర్యాంక్ 40, అబి జైన్ ఆల్ ఇండియా ర్యాంక్ 58 సాధించారని, ఎప్ స్వాన్ సవ్యసాచి ఆల్ ఇండియా ర్యాంక్ 80 ఐఐటీ గౌహతి జోనల్ లో ర్యాంక్ 1 సాధించారన్నారు. ఐఐటీ కాన్పూర్ జోన్లో జోనల్ ర్యాంక్ 2లో ఆల్ ఇండియా ర్యాంక్ 100 సాధించారు వైభవ్ సింగ్, అన్ అకాడమీ నాయకత్వంలో 3000 మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ డ్ 2023కు అర్హత సాధించారని తెలిపారు.

విశాలాంధ్ర

→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

కూడలి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: సిరిపురం (ద్రోణం రాజు సర్కిల్) కూడలి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జివియంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మూడవ జోన్ పరిధిలోని ద్రోణం రాజు సర్కిల్, బీచ్ రోడ్ లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ద్రోణం రాజు కూడలి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, కూడలిలో వ్యర్థాలతో తయారుచేసిన విభిన్న ఆకృతులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బీచ్ రోడ్ లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించి, పనులు మందకొడుగా సాగుతున్నాయని త్వరితగతిన పనులు చేపట్టి ఈనెల చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్డు కోస్టల్ బ్యాటరీ నుండి అప్పుఘర్ వరకు ప్రధాన కాలువలోని వ్యర్థాలను తీసి రోడ్డుపై ఉంచేస్తున్నారని, దీనివలన ఆ ప్రాంతం విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుందని, తీసిన వ్యర్థాలను వెంటనే ఎత్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివియంసి పర్యవేక్ష ఇంజనీర్లు వినయ్ కుమార్, వేణుగోపాల్, జొనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజనీర్, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం పాదయాత్ర బృందానికి సీపీఐ సంఘీభావం

విశాలాంధ్ర – ఎటపాక : మంగళవారం సీపీఎం పోలవరం నిర్వాసితుల సమస్యలపై తలపెట్టిన మహా పాదయాత్ర నెల్లిపాక నుండి ప్రారంభించారు. కాపవరం, తోటపల్లి మీదుగా గన్నవరం చేరుకున్నారు. వారికీ ఎటపాక సిపిఐ నాయకులు, స్వాగతం పలికి సంఘీభావంతెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పోలవరం ప్రాజెక్టు మీద ఉన్న ప్రేమ నిర్వాశితుల మీద లేదన్నారు. ముంపు మండలాల గ్రామాలనీ ముంపు జాబితాలో ఇంకా పూర్తి గా చేర్చలేదని అన్నారు. గత ఏడాది వచ్చిన వరదలను అంచనా వేసి పోలవరం ముంపు చేబితాలో చర్చలాన్నారు. మహా పాదయాత్ర చేపట్టిన బృందానికి సహాయం గా ఉంటామన్నారు. ఈ కార్యక్రమం లో మండల కార్యదర్శి ఎలిసలా నాగరాజు, ఎంపిటిసి కంటె రాజు, సిపిఐ సీనియర్ నాయకులు వల్లభనేని సత్యనారాయణ, డి హెచ్పిఎస్ నాయకులు వరద బ్రహ్మం, వెంకట రత్నం, గడ్డం వెంజటేశ్వర్లు, బొల్లి వరలక్ష్మి, ముక్కెర ధనమ్మ, అల్లూరి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

విశాలాంధ్ర – దేవీపట్నం: మండలంలోని ఇందుకూరు గ్రామంలో కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో తాటాకు ఇల్లు అగ్నికి ఆహుతైంది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ కొంచెం మురళి, సీరసం సత్య వేణి, మండల సచివాలయ కన్వీనర్ కందులు బాబ్జి, దేవీపట్నం ఎమ్మార్వో, వైస్ ఎంపీపీ గారపాటి మురళి వారిని పరామర్శించి ప్రభుత్వం తరపున వారికి సాయం చేస్తానని మాట ఇచ్చి 50కేజీల బియ్యం కొంత మొత్తాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.23 కోట్లు

విశాలాంధ్ర – గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి హుండీ మంగళవారం లెక్కించగా రూ. 2,23, 32,228/- కోట్లు, బంగారం 0-206-000 మిల్లీ గ్రాములు, వెండి 16 కేజీల 732 గ్రాములు. పైడి తల్లి అమ్మవారి హుండీ ఆదాయం రూ.80,870లు. 31 రోజులకు గాను భక్తులు హుండీలో ముడుపులు, మొక్కుబడులు కానుకలుగా సమర్పించి నట్లు ఇంచార్జ్ ఈఓ డి. భ్రమరాంబ, డి.సి, డి.ఈఓ సుజాత తెలి పారు. హుండీ లెక్కింపులో సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి.

గంజాయి రవాణా, నాటుసారా నిర్మూలనపై కఠినంగా వ్యవహరించాలి

విశాలాంధ్ర – కొయ్యూరు: గంజాయి సాగు రవాణా నాటుసారా నిర్మూలన విషయమై కఠినంగా వ్యవహరించాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశించారు. మండలంలోని కొయ్యూరు మంప పోలీస్ స్టేషన్లను ఏఎస్పి ప్రతాప్ శివ కిషోర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రెండు స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మన్యంలో గంజాయి సాగు నిర్మూలన చర్యల్లో భాగంగా గంజాయికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గిరి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండేందుకు కమ్యూనిటీ పోలీసింగ్ పేరిట వివిధ రకాల క్రీడలను నిర్వహించడం క్రీడా సామగ్రిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తమ పరిధిలో చింతపల్లిలో ఈనెల19 నుండి 26 వరకు డ్రైవింగ్ లైసెన్స్ లేని యువతకు ఎల్ఎల్ఆర్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రెండు స్టేషన్ల పరిధిలో 58 కేసుల్లో పట్టుబడిన సుమారు వెయ్యి లీటర్ల నాటు సారాను ఏఎస్పీ సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పి వెంట కొయ్యూరు సిఐ స్వామినాయుడు, కొయ్యూరు మంప ఎస్సైలు రాజారావు లోకేష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర – మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 40వ వార్డు పరిధిలోని గల సింధియా కూడలి వద్ద సింహాచలం వెళ్లే బస్సు మంగళవారం ప్రయాణికులను సింధియా కూడలి వద్ద దించి మలుపు తిప్పే క్రమంలో అదుపు తప్పి ఫుత్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఫుత్‌పాత్ వ్యాపారులు గమనించి వెంటనే అక్కడ నుంచి పరుగులు తీయడంతో బస్సు షిప్‌యార్డు రక్షణ గోడను ఢీకొట్టింది. మల్కాపురం పోలీసులు సంఘటన స్థలానికు చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాకపోకలకు ఆట ంకం లేకుండా చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జగనన్న సురక్షపై అవగాహన

విశాలాంధ్ర – పరవాడ: జగనన్న సురక్ష సర్వేక్షణపై విస్తృత అవగాహన కల్పించేందుకు సదస్సును బుధవారం వెన్నెల పాలెం కళ్యాణమండపంలో నిర్వహించనున్నట్టు పరవాడ ఎంపీడీవో హేమసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై ఒకటో తేదీ నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుపై ఇంటింటి సర్వేను ప్రభుత్వం నిర్వహించనున్నదని చెప్పారు. సర్వేను విజయవంతం చేసేందుకు అవగాహన కల్పించేందుకు సదస్సును నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులతో పాటు వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని హేమ సుందర్ కోరారు. ఈ అవగాహన సదస్సుకు జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బురద అప్పలరాజు తదితరులు హాజరవుతారని చెప్పారు.

పీఓను కలిసిన బాలరాజు

విశాలాంధ్ర – రంపచోడవరం: ఏజెన్సీని అభివృద్ధి చేయుటకు కేంద్ర ప్రభుత్వ ఇండియన్ ఎకనామికల్ సర్వీసెస్ సభ్యులు కె.యం.బాలరాజు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరేను వారి కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రంపచోడవరం మండలంలో వివిధ అభివృద్ధి పనులైన సీసీ రోడ్లు. త్రాగునీరు. ఐ పోలవరం గ్రామ సమీపంలోని కాల్వ దగ్గర టూరిస్ట్ పాయింట్ దగ్గర ఏ విధంగా అభివృద్ధి చేసింది, ఆదివాసి వర్తక సముదాయం వెనక భాగం కమ్యూనిటీ హాల్ ఏ విధంగా అభివృద్ధి చేసింది, అభివృద్ధి పనులను చర్చించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిపిఆర్ఆర్డి యన్.శ్రీనాథ్, కన్సల్టెంట్ రూర్బన్ సి పి ఆర్ ఆర్ డి వినోద్ కుమార్, తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లా జడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, రంపచోడవరం ఎంపీడీవో జాన్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు రద్దు చేయాలి

విశాలాంధ్ర – పెందుర్తి: పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ సిపిఎం శ్రేణులు, కార్మిక నగర్ విద్యుత్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్ మాట్లాడుతూ విద్యుత్ భారంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. గత ఏడాది1400 కోట్ల రూపాయలు ప్రజలపై భారం మోపిన ప్రభుత్వం ఇపుడు మరో 6000 కోట్ల రూపాయలు వసూలుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. సర్దుబాటు చార్జీలు అని చెప్పి అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఒకవక్క విద్యుత్ చార్జీలు పెంచుతూ మరొకపక్క వేళాపాలా లేకుండా విద్యుత్ కోతలు పెడుతు న్నారని మండిపడ్డారు. అడగని పథకాలు ఇచ్చి ప్రజలపై ఇలా భారాలు వేయడం దారుణమని అసహనం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ప్రభుత్వంపై తిరగబడ్డానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలనాయుడు, ఈశ్వరరావు, గోపి, రామారావు పాల్గొన్నారు

ఎంఈఓ-2గా బోడంనాయుడు

విశాలాంధ్ర – చింతపల్లి: స్థానిక మండల విద్యాశాఖ అధికారి-2గా బోడం నాయుడు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రతి మండలానికి మండల విద్యాశాఖ అధికారి-2లను ప్రతిష్టాత్మకంగా నియమించింది. ఇందులో భాగంగానే బోడం నాయుడు మండల విద్యాశాఖ అధికారి-2 గా బాధ్యతలు స్వీకరించారు. 2018 విద్యా సంవత్సరం నుంచి 2022 విద్యా సంవత్సరం వరకు కొయ్యూరు మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూనే 2022 విద్యా సంవత్సరంలో చింతపల్లి మండలానికి అదనపు బాధ్యతలు చేపట్టి ఆరు నెలల పాటు చింతపల్లి విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. బోడం నాయుడు సేవలను గుర్తించిన ప్రభుత్వం చింతపల్లి మండల విద్యాశాఖ అధికారి-2 గా నియమించింది.

విద్యాభివృద్ధికి సహకరిస్తా: సర్పంచ్

విశాలాంధ్ర – రాజవొమ్మంగి: జడ్డంగి లూథరన్ ఎయిడెడ్ పాఠశాలలో ప్రభుత్వం అందించిన పుస్తకాలు, యూనిఫాంలను జడ్డంగి సర్పంచ్ కొంగరా మురళి కృష్ణ పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి రూ 5000/- డొనేట్ చేశారు. ఈ కార్యక్రమంలో ముంగారి పొన్నాలు, వాలంటీర్ చెక్కా మల్లిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, జడ్డంగి గిరిసీమా యూత్ పాల్గొన్నారు.

కదిలిన జగన్నాథ రథచక్రాలు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: టౌన్ కొత్త రోడ్డులోని శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్ర అత్యంత శోభాయమానంగా జరిగింది. మంగళవారం ఉదయం స్వామి వారిని రథంపై వేంచేయించారు. శ్రీ జగన్నాథుడు, బలబద్రుడు, సుభద్రా దేవిలను ప్రార్థించేందుకు ఉదయం నుండి భక్తులు ఆలయం వద్ద బారులుదీరారు. వేద మంత్రాలు మంగళ వాయిద్యాల మధ్య శ్రీ జగన్నాథ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ శ్రీ జగన్నాథ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయ కొట్టి జగన్నాథస్వామి తొలి రథయాత్రను ప్రారంభించారు. దీంతో భక్తులు రథాన్ని ముందుకు లాగారు. శ్రీ జగన్నాధుని రథం వెంట చెంగల రావుపేటలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీ జగన్నాథుని రథం, కంచరవీధిలోని శ్రీ ఎంబర్ మున్నార్ స్వామి ఆలయంలో వెంచేసిసయున్న ఉన్న శ్రీ జగన్నాధుని రథాలు అనుసరించాయి. జై జగన్నాథ గోవిందా హరి గోవిందా అంటూ భక్తులు గోవిందనామ స్మరణ చేశారు. తొలి రథయాత్ర మెయిన్ రోడ్ నుండి టర్నర్ సత్రం వరకు సాగింది. శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్రలో దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్, శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఈఓ, ఫెస్టివల్ ఆఫీసర్ కె.శిరీష, ఎస్కేఎంఎల్ దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం స్థానిక కార్పొరేటర్లు కోదూరి వెంకటరత్నం, మాసిపోగు రాజు, సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ, పెంటపల్లి సత్యనారాయణ, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.రాజగోపాల్ రెడ్డి, అర్చకులు పి.జగన్నాథాచార్యులు, పి.రంగనాథా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

ఐటీడీఏ పీఓ అభిషేక్

విశాలాంధ్ర – హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం విజయవంతానికి ముందస్తు ప్రణాళికలతో అధికారులంతా సిద్ధం కావాలని పాడేరు ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. పథకాన్ని అమలు చేసే బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. ఈ పథకం అమలుకు మండల స్థాయి అధికారులు భాగస్వాములై విజయవంతం చేయ డానికి తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. ఈనెల 24 నుండి ఈ పథకం ప్రారంభమవుతుందని ప్రజలకు ఏదైనా పత్రాలకు సంబంధించి సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలకు సంబంధించి ఏదైనా సమస్యలు ఉంటే వాటిని త్వరితగతిన పరి ష్కరించేందుకు ఈ కొత్త పథకం శ్రీకారం చుడుతుందన్నారు. ప్రజల సమస్యల కోసం ప్రతి ఇంటికి వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి సత్వర మార్గం చూపించాలని కోరారు. ఈ జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజల సమస్యలకు సంబంధించి మండల అధికారులు ఆయా సచివాలయాల్లోకి క్యాంపులు నిర్వహించి ప్రభుత్వ పథకాలు లేదా సర్టిఫికెట్ సంబంధించి ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఈ పథకం అమలుకు సచివా లయ సిబ్బంది, వాలంటీర్లు గృహసా రథులు ప్రతి ఇంటికి వెళ్లి సమస్యను నమోదు చేసుకుని పరిష్కరించడంలో ప్రధమ పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, ఎంపీడీవో వెంకట్రావు, తాసిల్దారు రాజ్యలక్ష్మి, డిఎల్‌డిఓ శాంతి కుమారి, ఈవోపిఆర్‌డి అశోక్, విఆర్వో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి భవన నిర్మాణాలను
త్వరితగతిన పూర్తి చేయండి

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సూర్యలక్ష్మి

విశాలాంధ్ర – చింతపల్లి: నాడు నేడు పథకంలో భాగంగా నిర్మాణ పనులు జరుగుతున్న అంగన్వాడీ భవన నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ సూర్యలక్ష్మి అన్నారు. మంగళవారం చింతపల్లి వచ్చిన ఆమె స్థానిక ఐసిడిఎస్ సిడిపిఓ రమణితో కలిసి పెంటపాడు అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. నాడు నేడు ద్వారా నిర్మాణంలో ఉన్న అంగన్వాడి భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న భవన నిర్మాణ పనులపై ఆరా తీశారు. అనంతరం చింతపల్లి ప్రాజెక్టు కార్యాలయంలో గర్భిణీలు, బాలింతలు, ప్రీ స్కూల్ విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్యం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా, శిశు సంక్షేమం కోసం తమ శాఖ పనిచేస్తుందన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రతి నెల వారి యొక్క ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడమే గాక,. వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించి తల్లి ఆరోగ్యాన్ని కాపాడడమే గాక బిడ్డ యొక్క ఆరోగ్యాన్ని కూడా పూర్తిస్థాయిలో మెరుగువరిచేందుకు ఐసిడిఎస్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఎసిడిపివో రామలక్ష్మి, సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

అర్హత ఉండి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందని వారిని గుర్తిస్తాం

బలపం సర్పంచ్ రమేష్ నాయుడు

విశాలాంధ్ర – చింతపల్లి: అర్హత ఉండి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందని వారిని గుర్తించి వారికి కూడా ప్రభుత్వ పథకాలు పొందే విధంగా అవగాహన కల్పిస్తున్నామని బలపం సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు అన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు బచ్చుల మచ్చమ్మ తో కలిసి మంగళవారం మారుమూల బలపం పంచాయతీ పరిధిలోని 33 గ్రామాలలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ఎంతమంది లబ్ధి పొందుతు న్నారని, లబ్ధి పొందిన కుటుంబ సభ్యులకు ఆ పథ కాలు ఏ విధంగా ఉపయోగపడ్డాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందని కుటుంబాలు ఎన్ని ఉన్నాయి, ఏ కారణం చేత ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారనే దానిపై సచివాలయ అధికారులు వివరించాలన్నారు. ప్రభు త్వ పథకాలు అందని కుటుంబాలను త్వరితగతిన నివేదికలు తయారుచేసి సంబంధిత అధికారులకు అందజేసి అభివృద్ధికి తోడ్పడాలని సచివాలయం కార్యదర్శి లోచలి చిన్నంనాయుడు కు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు గెమ్మెలి చిట్టిబాబు, వైకాపా నాయకుడు బచ్చలి బాబురావు, గ్రామ వాలంటీర్ కోరాబు బాబురావు పాల్గొన్నారు.

భూ యజమానులు ఆమోదం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర – పాయకరావుపేట: భూ యజమానుల ఆమోదం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెచ్చిన సీసీఆర్సి చట్టం వల్ల గత నాలుగేళ్లుగా కౌలు రైతులు గుర్తింపు కార్డులకు నోచుకోవడం లేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీలు, రుణాలు, పంట నష్టపరిహారాలు భూ యజమానులే పొందుతున్నారని తెలిపారు. కౌలు రైతులకు అపార నష్టాలకు గురై అప్పుల పాలవుతున్నారని తెలిపారు. కౌలు రైతు ఆత్మహత్యలు నివారించాలంటే భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామసభ ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, వ్యవసాయ పెట్టుబడులకు వడ్డీ లేకుండా లక్ష రూపాయలు రుణాలు ఇవ్వాలని, కౌతు రైతులకు రైతు భరోసా అందివ్వాలని తదితర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిన నాగేశ్వరరావు, మోకిన మాణిక్యం, గంగిరెడ్డి శ్రీను, పి.ధనలక్ష్మి, టి.సూరిబాబు, బోడపాటి రాజు, చిన్ని నాగరాజు, అన్నవరం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని నాయకులు బాలకృష్ణ, నాగేశ్వరరావు విద్యుత్ ఎఈకి వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ, నీటి సమస్యలపై శ్రీరామ్ ఫౌండేషన్ కార్యాచరణ

విశాలాంధ్ర – విశాఖ సిటీ: డీసీఎం శ్రీరామ్ ఫౌండేషన్ ది/నడ్జ్ ఇన్స్టిట్యూట్ యొక్క సెంటర్ ఫర్ సోషల్ ఇన్నోవేషన్, ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయంతో కలిసి వ్యవసాయం, నీటి సమర్థ వినియోగం పరంగా ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో రూ.2.6 కోట్ల బహుమతి ఛాలెంజ్‌ను ప్రారంభించాయి. భారతదేశం యొక్క వ్యవసాయ-నీటి పర్యావరణ వ్యవస్థలో జనాభా స్థాయి పరిష్కారాలు ఆవిష్కరణలను అభివృద్ధి చేయడానికి, స్తబ్ధుగా ఉన్న జీవనోపాధి అవకాశాలపై, ముఖ్యంగా చిన్న రైతుల కోసం భారీ ప్రభావం చూపే పరిష్కారాలను చూపేలా ప్రముఖ అగ్రిటెక్ సోషల్ ఇంపాక్ట్ వ్యవస్థాపకులను ప్రోత్సహించడానికి ఈ సవాలు ప్రయత్నిస్తుందని డీసీఎం శ్రీరామ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ అమన్ పన్ను చెప్పారు. రాబోయే డీసీఎం శ్రీరామ్ అగ్‌వాటర్ ఛాలెంజ్ కోసం, ది/నడ్జ్ ప్రైజ్ గణనీయంగా రూ. 2.6 కోట్ల విలువైన బహుమతిని కలిగి ఉంటుందని, ఇందులో విజేతకు రూ.2 కోట్ల గ్రాండ్ ప్రైజ్ ఉంటుందని చెప్పారు.

ఐటీఐ పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన

విశాలాంధ్ర – హుకుంపేట: మండల కేంద్రంలో గల గడుగుపల్లి గ్రామ సమీపంలో ఐటిఐ పాఠశాల నిర్మాణానికి మంగళవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ స్థల పరి శీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 47 సర్వే నెంబర్ గల భూమిలో 5 ఎకరాల 10 సెంట్లు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ రాజలక్ష్మి, ఆర్ఐ రంగా రావు, సిబ్బంది వీఆర్వో, సర్వేయర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాల్సిందే

విశాలాంధ్ర – రాజవొమ్మంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, ఎంపిడిఓ యాదగిరీశ్వరరావు జగనన్న సురక్షపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు ఎంతవరకు అందుతున్నాయో తెలుసుకోవాలన్నారు.

జీపు బైకు ఢీ: యువకుడు మృతి

విశాలాంధ్ర – జి.మాడుగుల: మండలం కే.కోడాపల్లి పంచాయతీ సమీపంలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం జీపును ఢీకొట్టిన సంఘటనలో ఒక యువకుడు మృతి చెందగా మరొక వ్యక్తి తీవ్ర గాయాలు పాలయ్యాడు. పాడేరు మండలం ఐరడాపల్లి పంచాయతీ సరియా పల్లి గ్రామానికి చెందిన కోడా చిన్నయ్య (30), కోడా నారాయణ తమ గ్రామానికి వెళుతుండగా మార్గ మధ్యలో కేకోడపల్లి సమీప మలుపు వద్ద పాడేరు నుంచి జి.మాడు గుల వస్తున్న ప్రైవేట్ జీపును బలంగా ఢీకొనడంతో కోడా చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలు పాలైన నారాయణను పాడేరు జిల్లా ఆస్పత్రి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. దీనిపై జి మాడుగుల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా జగన్నాథుని రథోత్సవం

విశాలాంధ్ర – చోడవరం: చోడవరం పురాణ శ్రీ కేశవ స్వామి సన్నిధిలో ఉపాలయంగా వేంచేసి ఉన్న శ్రీ కృష్ణ బలభద్ర సమేత జగన్నాథుని రథోత్సవం మంగళవారం వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈ.ఓ. ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ అలమండ ఈశ్వరరావు, వై.సి.పి. ఇంఛార్జి పప్పల జయదేవ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేశవుని సేవకులు వెంట రాగా సుభద్ర బలబద్ర సమేత శ్రీ పట్టణ పుర వీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఆషాఢ శుద్ధ పాడ్యమి నుండి ఏకాదశి వరకు స్వామి వారు దశావతారాల్లో దర్శనమిస్తారు.

ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ రవి బదిలీ

విశాలాంధ్ర – చోడవరం :చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న రవి బదిలీ అయ్యారు. చోడవరంలో 12 సంవత్సరాలు పని చేసిన రవి ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు విశేష సేవలు అందించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ల్యాబ్ టెక్నీషియన్ గా రవి అందించిన వైద్య సేవలు మరచిపోలేనివి అని స్థానికులు చెబుతున్నారు. ఎల్లవేళలా ప్రజలకు, రోగులకు, సిబ్బందికి అందుబాటులో ఉంటూ, అందరిలో మంచి మన్ననలు అందుకుని, బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనకాపల్లి వంద పడకల ప్రభుత్వాసుపత్రి నుండి ల్యాబ్ టెక్నీషియన్ శంకర్ వస్తున్నారని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్నెంట్ డాక్టర్ ఎల్. వినయ్ కుమార్ తెలిపారు.

భవిష్యత్తు గ్యారంటీ బస్సు యాత్రను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర – పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 22న పాయకరావుపేటలో జరగబోయే భవిష్యత్తు గ్యారంటీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత కోరారు. పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో వంగలపూడి అనిత సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టీబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, మల్లపురెడ్డి రమాకుమారి, బొంది కాశీవిశ్వనాద్, కొప్పిశెట్టి వెంకటేష్, అబద్దం, కురందాసు నూకరాజు, పల్లా విలియంకేరి, లెక్కల గోవిందునాయుడు, జూరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.